# నేడే వార్త ముగ్గుల పోటీలు

తిరుపతి(విద్య),జనవరి 10ప్రభాతవార్త




తెలుగు ప్రజల సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సంప్రదాయాలకు అద్దం పడుతున్న "వార్త" జాతీయ తెలుగు దినపత్రిక ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. బుధవారం(నేడు) ఉదయం 9గంటలకు తిరుపతి ఇందిరామైదానంలో ఈ పోటీలు జరుగుతాయి. రంగవల్లుల పోటీల్లో పాల్గొనే వాళ్ళు స్వయంగా రంగులు, ముగ్గుపిండి తీసుకురావాలి. ఈ పోటీలో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేయబడుతాయి.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# నేడు 6వ విడత జగనన్న తోడు

## జిల్లాలో 31,649 లబ్దిదారులకు రూ.84.80 లక్షలు లబ్ది

చిత్తూరు, జనవరి 10 ప్రభాతవార్త:
సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 11 గంటలకు తన క్యాంపు కార్యాలయం తాడేపల్లి నుండి జగనన్న తోడు 6వ విడత పథకంను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. జిల్లా స్థాయిలో జిల్లా సచివాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. వీధి విక్రయదారులు, కూరగాయల విక్రయదారులు, చిరు వ్యాపారులు రుణాల కోసం వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు వడ్డీ లేని రుణాలను లబ్దిదారులకు అందజేస్తోంది. క్రమం తప్పకుండా బ్యాంకులకు తిరిగి చెల్లించిన లబ్దిదారుల వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తోంది. జిల్లాలో 6వ విడత జగనన్న తోడు కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని 21,866 మంది లబ్దిదారులకు రూ.59 లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని 9,783 మంది లబ్దిదారులకు రూ.24 లక్షల రూపాయల లబ్ది చేకూరనుందని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు.

# అందరి చూపు "యువగళం"పైనే!

## -లోకేష్ పాదయాత్రపై తెలుగుతమ్ముళ్ళ ఫోకస్ !!



ప్రభాతవార్త-తిరుపతి:
తెలుగు ప్రజల్లోనేగాక రాజకీయపార్టీల నేతల్లోనూ బలమైన విశ్వాసం ఉన్న పాదయాత్ర కార్యక్రమంతో అధికారం తథ్యమనే అంశంపై ఇప్పుడు ఉమ్మడి చిత్తూరుజిల్లాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. ఈ పాదయాత్ర చేపట్టే పార్టీల నాయకులుగానీ, వారి వారసులుగానీ ప్రజలతో మమేకమవడం, ప్రజల కష్టాలను స్వయంగా పరిశీలించడం వంటివి నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు అవకాశంగా ఉంటుంది. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి,ఆ తరువాత చంద్రబాబునాయుడు, నాలుగుసంవత్సరాల క్రిందట ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా రాష్ట్రంలో (ప్రజాసంకల్పయాత్ర)పాదయాత్ర చేపట్టి ఎన్నికల్లో ప్రజల అభిమానంతో గెలిచి అధికారం చేపట్టిన దాఖలాలు ఉన్నాయని రాజకీయనేతల విశ్వాసం. ఇప్పుడు 2024 ఎన్నికలకు ముందుగానే రాష్ట్రంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి చెందిన యువనేత, జాతీయ కార్యదర్శి నారాలోకేష్ ఈనెల 27వ తేదీ నుంచి "యువగళం"పేరుతో పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఏకంగా 400 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా కాలినడకన పర్యటిస్తూ ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకోనున్నారు. ఇప్పటికే వైసిపి ప్రభుత్వంపై ప్రజల తరపున టిడిపి బలంగా పోరాటం చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. దీనికితోడు అరకొర వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ఇప్పుడు యువనేత నారా లోకేష్ పాదయాత్ర చేపట్టనుండటంతో టిడిపి శ్రేణుల్లోనేగాక తెలుగుతమ్ముళ్ళలో జోష్‌గా మారుతోంది. అంతేగాక నాలుగుసంవత్సరాల అధికార వైసిపి ప్రభుత్వంపై , తీసుకున్న నిర్ణయాలుపై, ఇబ్బందులపై ప్రజలకు వివరించేలా ఫోకస్ పెట్టేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారనేది టిడిపి కార్యకర్తల్లో బలంగా చర్చ మొదలైంది. ఇదే నిజమైతే ఈనెల 27వతేదీ కుప్పం నియోజకవర్గం నుంచి లోకేష్ పాదయాత్ర చేపట్టనున్నందున అందరి దృష్టి ఇప్పుడు యువగళంపైనే సారిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని టిడిపి జాతీయ,రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి నాయకులు అందరూ కూడా ఈ పాదయాత్రలో అడుగు వేసి గళం కలపనున్నారు. జిల్లాలోని తెలుగుదేశం నాయకులు కూడా దీనిపై ఉత్సాహంగానే ఉన్నారు. మరీ టిడిపి నేతలు తమ వాయిస్‌ను ప్రజల్లోకి ఎలా బలంగా తీసుకెళ్ళనున్నారనేది లోకేష్ పాదయాత్రలో స్పష్టం కానుంది. మొత్తంమీద తెలుగుప్రజలు సెంటిమెంట్‌గా భావించే రాజకీయ నేతల పాదయాత్ర ఏమేరకు రానున్న ఏడాదిలో తెలుగుదేశంకు కలిసి వస్తుందనేది చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

గణనాధునికి

# వైభవంగా స్వర్ణ రథోత్సవం



స్వర్ణరథంపై ఊరేగుతున్న గణనాధుడు.

కాణిపాకం, జనవరి 10 ప్రభాతవార్త:
కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో స్వామివారు మంగళవారం సాయంత్రం ఉభయదేవేరులతో కలసి స్వర్ణరథంపై ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకష్ట హర చతుర్థి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు ఆలయంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో సంకటహర చతుర్థి వ్రతంను ఘనంగా నిర్వహించగా సాయంత్రం స్వామివారికి స్వర్ణ రథోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మిరమిట్లు గొలుపుతున ్న స్వర్ణరథంపై వుంచి మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ మాడా వీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# జల్లికట్టు, కోడి పందేల కట్టడికి నిఘా

## -అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్



చిత్తూరు, తిరుపతి క్రైం, జనవరి 10 ప్రభాతవార్త:
సంక్రాంతి పురస్కరించుకొని అనంతపురం రేంజ్ పరిధిలో ఎక్కడా జల్లికట్టు, కోడి పందెలు, జూద క్రీడలు జరుగకుండా పక్కాగా నిఘా వేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ ఆదేశించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కోడిపందెలు, జల్లికట్టు, జూద క్రీడలు నిర్వహించడం నిషేధమని, ఎవరైనా వీటి జోలికి వెళ్ళినా, ఆడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సాంప్రదాయ క్రీడలను నిర్వహించుకొని భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామ మహిళా పోలీసులను సమన్వయం చేసుకొని ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి నిషేధిత జూదాలు, క్రీడలు జరుగకుండా వుండేలా సమాయాత్తం చేయాలన్నారు. సంబంధిత డిఎస్పీలు పక్కాగా పర్యవేక్షించి ఎక్కడా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కోడి పందెలు, జల్లికట్టు ఆటలు జరిగే వీలున్న ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో కోడిపందెలు, జల్లికట్టు కేసులున్న వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. కోళ్ళకు కత్తులు కట్టి పందెలు ఆడటం, జన సమూహాల మధ్యన ఎద్దులను రెచ్చగొట్టి కట్టడి చేయడంలో భాగంగా హింసించడం తదితరాలు మూగ జీవులను హింసించడం అవుతుందన్నారు. జల్లికట్టు, కోడి పందెలు నిర్వహించడానికి ఎవరైనా స్థలాలు ఇస్తే వారిపై సైతం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

పదవుల్లో కాదు

# సమస్యల పరిష్కారంలోనే తృప్తి

## రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నడిగడ్డలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సదుం, జనవరి 10 ప్రభాతవార్త
పదవుల్లో కాదు ప్రజా సమస్యల పరిష్కారంలోనే తృప్తి ఉంటుందని రాష్ట్ర విద్యుత్ అటవీ పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రెండోరోజు పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆయన,మొరవపల్లె, బూరగమంద, జోగివారిపల్లె, చెరకువారిపల్లె, నడిగడ్డ పంచాయతీలలోని అన్ని పల్లెల్లో పర్యటించారు. ఈసందర్భంగామొరవపల్లె, బూరగమంద,దేవదారుమాకులపల్లెలో అంగనవాడీ కేంద్రాలను, బూరగమంద, నడిగడ్డలలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సీతన్నగారిపల్లెలో గ్రామ సచివాలయ భవనం, జోగివారిపల్లెలో రైతు భరోసా కేంద్రంలను ఆయన ప్రారంభించారు. అదే విదంగా బూరగమంద పంచాయతీ పరిదిలోని కొత్తవడ్డిపల్లెకు చెందిన 18 కుటుంబాలు అనేక సంవత్సరాలుగా బూరగమందలోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారి పల్లకీ మోస్తూ దేవాదాయ డీకేటీ భూముల్లో నివశిస్తున్నారు. గతంలో వారి సమస్యలు మంత్రి దృష్టికి తీసుకోవడంతో మంగళవారం వారు ఉంటున్న నివాసస్థలాలకు సంబంధించిన అధీకృత పత్రాలను మంత్రి అందజేశారు. నడిగడ్డలో భూహక్కు పత్రాల పంపిణీని మొదలు పెట్టారు. కార్యక్రమంలో భాగంగా గాదేవారిపల్లెలో 27 మంది తెదేపా తీర్థం పుచ్చుకున్నారు వారికి మంత్రి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చీకలచేనులో తాగునీటి సమస్య పరిష్కరించాలని, చెరకువారిపల్లెలో దారి సమస్య పరిష్కరించాలని,చీకలచేనుకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు మంత్రిని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ,ప్రభుత్వ సేవలను సులబతరం చేస్తూ గ్రామ స్థాయిలోని ప్రజలకు సేవలు అందించేలా సచివాలయ వ్యవస్థతో పాటు రైతులకు అవసరమైన ఆదునాతన సాంకేతిక పద్దతులోల వ్యవసాయ సాగు పద్దతులపై అవగాహన కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను ,మెరుగైన వైద్య సేవలను అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించడం జరుగుతున్నదన్నారు. గర్భవతులకు అవసరమైన పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా డాక్టర్ వైఎసా ్సర్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో జడ్పీ చైర్మెన్ గోవిందప్పశ్రీనివాసులు, జడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి, డీపీఓ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి,ఎంపీపీ ఎల్లప్ప,జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, అటవీశాఖ మాజీ డైరెక్టర్ వల్లివేడురాజారెడ్డి,ఆయా గ్రామాల సర్పంచిలు జగన్నాథం, వెంకటరమణ,అనితాకుమారి,ఐశ్వర్య,నారాయణరెడ్డి, వైఎస్ ఎంపీపీలు ధనంజయరెడ్డి, అమరావతి పుట్రాజు, ఎంపీటీసీ మల్లికార్జున, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, కోఆప ్షన్ సభ్యుడు ఇమ్రాన్,సింగిల్‌విండోఅధ్యక్షుడు తిమ్మారెడ్డి,సోమల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శివానందరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ శివశంకర్, ఏపీఎం హరిప్రసాద్,తహశీల్దారు చంద్రశేఖర్, డాక్టర్ చరణ్, వాటర్‌షెడ్ చైర్మెన్‌లు జీవీరమణ, రమేష్‌రెడ్డి,వైకాపా నాయకులు రెడ్డెప్పరెడ్డి, గణేష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి,ఎస్జీ మధుసూధన్‌రెడ్డి, రామయ్య,సచివాలయ కన్వీనర్లు,వాలంటీర్లు, సంఘమిత్రలు,పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# సంక్రాంతికి నారావారిపల్లికి రానున్న నారా..నందమూరి కుటుంబాలు



కుప్పం, జనవరి 10 ప్రభాతవార్త
తెలుగువారు నిర్వహించుకునే పెద్ద పండగల్లో ఒకటైన సంక్రాంతి పండగ వేడుకలు జరుపుకునేందుకు ప్రతిపక్ష నేత, తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు, సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కుటుంబాలు చంద్రబాబునాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని స్వగ్రామమైన చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లికి రానున్నాయి. గత మూడేళ్లుగా కోవిడ్ నేపథ్యంలో వీరు నారావారిపల్లికి రాలేదు. హైదరాబాదులోనే పండగను జరుపుకున్నారు. మూడేళ్ల అనంతరం నారావారిపల్లికి నారా, నందమూరి కుటుంబాలు రానున్నాయి. తొలుత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, బాలకృష్ణ సతీమణి వసుంధరలు నారావారిపల్లికి చేరుకోనుండగా మరుసటి రోజు నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్, నందమూరి బాలయ్యలు నారావారిపల్లికి రానున్నారు. దీంతో జిల్లాలోని తెదేపా శ్రేణులు మరోమారు నారా,నందమూరి కుటుంబాలను కలిసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

# రైతుల ధాన్యాలకు మద్దతు ధర కల్పించాలి

## -కలెక్టర్ వెంకట రమణారెడ్డి

తిరుపతిరూరల్, జనవరి10 ప్రభాతవార్త:




రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలని సంబంధిత అధికారులను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆదేశించారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుండి మద్దతు ధర ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. పి.ఏ.సి.ఎస్, మార్కెటింగ్ శాఖ సిబ్బందికి సివిల్ సప్లేయ్ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన శిక్షణలో భాగంగా రైతులకు మద్దతు ధర కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్, జిల్లా వ్యవసాధికారి ప్రసాదరావు, సురేంద్రబాబు, ఆర్.బి.కె., మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

# కట్టుకున్నవాడే... కడతేర్చాడు!

## మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు



మృతురాలు తేజస్విని

వెదురుకుప్పం, జనవరి 10 ప్రభాతవార్త :
అగ్నిసాక్షిగా తాళికట్టి ఏడు అడుగులు నడిచి జీవితాంతం తోడు... నీడగా ఉంటానని పెళ్ళి చేసుకున్న భర్తే భార్యను కడతేర్చాడంటూ మృతురాలి తండ్రి చలపతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ డి.గోపి మంగళవారం తెలిపారు. ఫిర్యాదు మేరకు వివరాలిలా.... మండలంలోని పచ్చికాపల్లం పంచాయితీ పరిధిలోని నక్కలాంపల్లెకు చెందిన శేఖర్‌కు చౌడేపల్లె మండలంకు చెందిన తేజస్వినిలకు సుమారు మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి రెండు సంవత్సరాల పాప, మూడు నెలల బాబు ఉన్నారు. కాగా శేఖర్ ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉండడంతో వారి మధ్య గొడవలు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో జనవరి 8 రాత్రి వారిమధ్య గొడవలు పెద్దవి కావడంతో కట్టుకున్న భర్తే కాలయముడై గొంతుబిగించి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించి నమ్మించే ప్రయత్నం చేశారని చెప్పారు. శేఖర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని చలపతి ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహాంను శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉష్ణోగ్రతలు

10/1/2023



- తిరుపతి 29 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

## బంగారం ధరలు

10/1/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5, 237

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,713

## కోడిగ్రుడ్ల ధరలు

10/1/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

# తిరుపతిలో శ్రీవాణి దర్శనం టిక్కెట్ల కౌంటర్ మూసివేత




తిరుమల,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామిని మరింత దగ్గరగా వీక్షించే అవకాశం ఉన్న శ్రీవాణి బ్రేకదర్శనం (ప్రోటోకాల్ తరహాలో)టిక్కెట్ల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం తగ్గించింది. ఆన్‌లైన్‌లో రోజుకు 750 టిక్కెట్లు , ఆఫ్‌లైన్‌లో 250 టిక్కెట్లు జారీ చేస్తారు. అంతేగాక తిరుపతి మాధవంలో ఉన్న శ్రీవాణి దర్శనం టిక్కెట్ కౌంటర్లను మూసివేశారు. విమానాశ్రయంలో కౌంటర్‌ను మాత్రమే నిర్వహించి, విమానప్రయాణీకులకు ఈ కౌంటర్‌ను టిటిడి అధికారులు పరిమితం చేశారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు నిలువుదోపిడీ!

## సమాచార కేంద్రం ఉన్నా నప్రయోజనం శూన్యం!!

శ్రీకాళహస్తి, జనవరి 10 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన రోజు రోజుకు తీసికట్టుగా మారుతుంది. ఇక్కడ దళారుల ఇష్టారాజ్యంగా మారి. వచ్చిన భక్తులు మరోసారి రాకూడదని భావిస్తున్నారు. బస్సు దిగినప్పటి నుంచికార్లలో వస్తే పార్కింగ్ వద్దనే 'ప్యాకేజి దళారులు మాట్లాడుకుంటున్నారు.' దాంతో భక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అధికారులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా, సంస్కరణలు అమలు చేస్తున్నా రాజకీయ పలుకుబడితో దందా చేస్తున్న దళారుల బరితెగించి వ్యవహారిస్తున్నారు.శివయ్య ఆదాయాలు పెంచటానికి దేవస్థానం రంగులగోపురం రూ.200ల శీఘ్ర దర్శనం కౌంటర్‌ను ఏర్పాటు చేసారు.మరో కౌంటర్ పిఆర్ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసారు. రంగుల గోపురం వద్ద కౌంటర్‌ను సిద్దం చేసారు కానీ ఇంకా ప్రారంభించలేదు. అయితే పిఆర్ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌ను 'నాల్గవ గేటు' వద్ద ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందనిపరిశీలకులు భావిస్తున్నారు.నాల్గవ గేటు వద్ద దేవస్థానం అధికారులు సమాచార కేంద్రం ఏర్పాటు చేసి ఉన్నారు.అయితే దాని వల్ల ప్రయోజనం మాత్రం శూన్యం. ఎవ్వరికి ఇది ఉపయోపగడటం లేదు. ఇక్కడ వచ్చిన వాహనదారులు గేటు నుంచి లోపలకు కారు ఎలా పోవాలని చూస్తారు తప్ప కౌంటర్ వద్ద సమాచారం అడిగితెలుసుకునే పరిస్తితి ఉండదు. అయితే ఇక్కడే పార్కింగ్ ఉంది. అక్కడే దళారులు తిష్టవేసి తమ వ్యాపారాన్ని సజావుగాసాగించుకుంటున్నారు. దేవస్థానం అధికారులు,పాలకులు స్పందించి నాల్గవ గేటు వద్దనే శీఘ్ర దర్శన టిక్కెట్లు (రూ.200) అలాగే ప్రత్యేక విఐపిల రాహుకేతుదోష నివారణ పూజా టిక్కెట్లు, సమాచార కేంద్రం ఒకే చోట ఏర్పాటు చేసి సమాచారం అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.కానీ అధికారుల తీరు దున్నపోతూఈనిందంటే గాట్లో కట్టేయ్ అన్న చందాన మారింది. అధికారుల అవగాహన లోపంతో పథకాలు నామమాత్రంగా మారుతున్నాయి. ఇక వచ్చిన భక్తులకు సమగ్ర సమాచారం, బస సదుపాయాలకు సంబంధించి పట్టణనడిబొడ్డులోని 'కృష్ణారెడ్డి' మండపంలో ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందనేది జగమెరిగిన సత్యం అయితే అధికారులు ఆ దిశగా ఆలోచించటం లేదు.ఇప్పటికైనా పాలకమండలి స్పందించి చర్యలు తీసుకొని భక్తుల నిలువుదోపిడిని అరికట్టాలని కోరుతున్నారు.




నాల్గవ గేటు వద్ద ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం

## జగనన్న సంక్షేమ పాలనలో అందరూ భాగస్వాములు కావాలి
### - చిత్తూరు ఎమ్మెల్సీ భరత్



కుప్పం, జనవరి 10 ప్రభాతవార్త
సిఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలనలో అందరూ భాగస్వాములు కావాలని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళా ఉద్యోగులకు ఎమ్మెల్సీ భరత్ సంక్రాంతి కానుకల పేరిట నూతన చీరలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప ్పంలో అందరూ ఓ కుటుంబంలా కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హుడైన నిరుపేదకు లబ్ది కలిగించాలన్నదే తమ లక్ష్యమన్నారు. తకుప్పం మున్సిపాలిటీలో ఇదివరకే ప్రారంభించిన 66 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, వైస్ ఛైర్మన్ మునసా ్వమి, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి,కార్మిక నేత ఆర్.రంగయ్య, కౌన్సిలర్లు సోమశేఖర్, మోహన్‌రాం, విజయ్‌కుమార్, సలహాదారు ఆర్.శ్రీనివాసులు, కమీషనర్ రవిరెడ్డి,కో ఆప్షన్ సభ్యులు అరుల్, సర్దార్‌బాషా, ఐదో వార్డు ఇన్‌చార్జ్ సిపి మనోహర్, ఎంఇఒ మహబూబ్ బాషా, సిపిడిఒ అరుణశ్రీ, వివిధ శాఖల ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## బెంగళూరులో కుప్పం వాసి మృతి



కుప్పంరూరల్, జనవరి 10 ప్రభాతవార్త
కర్ణాటక రాజధాని బెంగళూరులో కుప్పం ప్రాంతానికి చెందిన ఓ యాచకుడు మృతి చెందినట్లు సమాచారం అందిందని ఎస్సై శివకుమార్ తెలిపారు. మృతుడి పేరు శంకర్, తండ్రిపేరు వెంకటేష్‌గా అతని వివరాలు బెంగళూరులోని అనాథాశ్రమంలో నమోదై ఉన్నాయన్నారు. మృతుడికి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటాయన్నారు. మృతుడిని గుర్తుపట్టిన వారు కుప్పం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## అభివృద్ధి..సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యం
### - ఎమ్మెల్సీ భరత్



శాంతిపురం, జనవరి 10 ప్రభాతవార్త
రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. మంగళవారం నాయనపల్లిలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, కృష్ణమూర్తి, దండపాణి, పట్టాభి, కార్యదర్శి రవినాయక్, వివిధ శాఖల అధికారులు, నేతలు పాల్గొన్నారు.

## ఇంటెన్షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



పలమనేరు,జనవరి 10,ప్రభాతవార్త:
ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇన్‌టెన్షిప్‌లో ఉత్తమ ప్రదిభ కనపరిచారు.ప్రభుత్వ నూతన విధానం ప్రకారం రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలో ఇన్‌టెన్షిప్ తప్పనిసరి కావడంతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు ఏ సర్వే ఆన్ ఫన్‌క్షన్ యాక్టివిటీస్ ఆఫ్ ఎపిఎస్‌ఆర్టీసిపై పలమనేరు ఎపిఎస్ ఆర్టీసికి ప్రాజెక్టును సమర్పించారు.ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ప్రజారవాణా అధికారి జితేంద్రనాథ్‌రెడ్డి,డిప్యూటీ మేనేజన్ రామక్రిష్ణా,కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశ్వర్లు విద్యార్థులకు ఇంటెన్షిప్ పత్రాలను అందించారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



పలమనేరు,జనవరి 10,ప్రభాతవార్త:
అనుమానాస్పద స్థితిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొలమాసనపల్లె సమీపంలోని వ్యవసాయ పొలంలో గుర్తితెలియని సుమారు 50సంవత్సరాల వ్యక్తి మృతదేహాన్ని రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.ఈ మేరకు ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతి చెందిన వ్యక్తి వివరాలు లభించలేదని కేసు ధర్యాప్తు చేస్తునట్లు ఆయన తెలిపారు.

## తెదేపా నేతలకు బెయిల్ మంజూరు



కుప్పం, జనవరి 10 ప్రభాతవార్త
ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు శాంతిపురం పర్యటన సందర్భంగా నమోదైన కేసుల్లో నలుగురు తెదేపా నేతలకు కోర్టులో బెయిల్ మంజూరైంది. వాసు, జమీర్, ప్రకాష్, శేషాద్రి అనే తెదేపా నేతలను సోమవారం రాత్రి పోలీసులు కుప్పం కోర్టులో హాజరు పరచి రిమాండ్ కోరారు. అయితే జడ్జి రిమాండ్‌ను తిరస్కరించి నలుగురికీ బెయిల్ మంజూరు చేసింది. దీంతో తెదేపా నేతలు ఉత్సాహంగా కన్పించారు. ఈస ందర్భంగా తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కేసులు నమోదైన నేతలు, కార్యకర్తలకు అని ్నవేళలా అండగా నిలుస్తున్నారన్నారు. న్యాయవాదులను సైతం నియమించి కార్యకర్తలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చౌడేపల్లి, జనవరి 10 ప్రభాతవార్త
రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డ సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో ఆమినిగుంట వద్ద ఇటుగా వస్తున్న టూవీలర్‌ను పందిళ్ళపల్లి నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సదుం మండలం శ్రీరామపురంకు చెందిన రమణ(25)కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని చుట్టుపక్కల వారు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108సేవల ద్వారా పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## బోయకొండ అభివృద్ధిపై మంత్రితో చర్చ



చౌడేపల్లి, జనవరి 10 ప్రభాతవార్త
శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి ఆలయ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఇఒ చంద్రమౌళిలు తీసుకెళ్ళారు. సదుం మడలంలో ఎర్రాతివారిపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డిని కలసి భవానీనగర్, గంగాపురం, కొండపై జరుగుతున్న పలు కార్యక్రమాలను ఆయన వివరించారు. ఆలయ అభివృద్ధిలో రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి వారికి ఆదేశించినట్లు ఛేర్మన్ మిద్దింటి తెలిపారు.
సిడిపిఎల్ 3 : అభివృద్ధి వివరాలు తెలుపుతున్న మిద్దింటి

## టిబి బాధితులకు పోషకాహారం పంపిణీ



పలమనేరు,జనవరి 10,ప్రభాతవార్త:
పలమనేరు పట్టణంలో టిబి బాధితులకు పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా పోషకాహారు (చిరుదాన్యాలు) పంపిణీ చేశారు.దాతలు శ్రీపురం సీతారామయ్య, మంజునాథ్ సహకారంతో పలమనేరు పరిరక్షణ సభ్యులు స్థానిక ఎన్టీఒ కార్యాలయం వద్ద బాధితులకు పోషకాహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆనందబాబు,పిపిఎస్ కార్యదర్శి నరసింహులు,డా.మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మానవహక్కుల కౌన్సిల్ పరిశీలకులుగా ధనంజయ నాయుడు



పెద్దపంజాణి జనవరి 10 ప్రభాతవార్త :
కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్‌లో రిజిష్టర్ కాబడిన ప్రపంచ మానవహక్కుల కౌన్సిల్ ఏపి,కర్ణాటక రాష్ట్రాల పరిశీలకులుగా పెద్దపంజాణి మండలం కోగిలేరు పంచాయతీ చీకలదిన్నెపల్లికి చెందిన ధనంజయ నాయుడు ఎన్నికయ్యారు.మంగళవారం హైదరాబాద్‌లో సంస్థ ఛైర్మన్ బాలరాజు రావూరి చేతులమీదుగా ఆయన నియామక పత్రాలను అందుకున్నారు.ఈ సందర్భంగా ధనుంజయ నాయుడు మాట్లాడుతూ ఏపీ,కర్ణాటక రాష్ట్రాల్లో మానవహక్కులరక్షణకు తాను కృషి చేస్తామన్నారు.పేదప్రజలకు అన్యాయం జరగకుండా వారితరుపున మానవహక్కుల కౌన్సిల్ తరపున పోరాటం సాగిస్తామని పేర్కొన్నారు.ప్రజలు కూడా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.మున్ముందు ప్రజలు మానవహక్కు చట్టాలపై అవగాహనకార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.తనపై నమ్మకంతో రెండు రాష్ట్రాల పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించిన ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.రెండు రాష్ట్రాల కౌన్సిల్‌గా బాధ్యతలు చేపట్టిన ధనంజయ నాయుడును మిత్రులు గ్రామంలోని ప్రజలు,పలువురు నాయకులు ఆయనను అభినందించారు.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సంక్షేమానికి సిఎం వైఎస్ జగన్ పెద్దపీట
### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, జనవరి 10 ప్రభాతవార్త:
అన్ని వర్గాల సంక్షేమానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేసి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద గ్రామ సచివాలయం పరిధిలో అడవిచేను గ్రామ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకొన్నారు. పథకాలకు అర్హులుగా వుండి ఎవరికైనా పథకాలు అందకుంటే మళ్ళీ దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిశీలించి సత్వరం పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసీ బాబు, తహసిల్దారు పార్వతి, మండల వైకాపా అధ్యక్షుడు త్యాగరాజు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బాబు

ఐరాల, జనవరి 10 ప్రభాతవార్త:
ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. మంగళవారం మండలంలోని చినకాంపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని లింగారెడ్డి ఇండ్లు, దామరగుంట, మిట్టఇండ్లు, కురప్పల్లె, వంద్రాంపల్లె, చిలకాంపల్లె, చినకాంపల్లె బీసీ కాలనీ గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే బాబు గడప గడపకు- మన ప్రభుత్వం కార్యక్రమంను నిర ్వహించారు. ఈసందర ్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకుని నవరత్నాలు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతం మోహన్, ఎంపీడీఓ నిర్మలాదేవి,తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ నిత్య, నాయకులు చిన్నారెడ్డి, చంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, కెఎస్.శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దుస్థితిలో అంగన్‌వాడీ కేంద్రం


చలమరాజుకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రం

పాలసముద్రం, జనవరి 10 ప్రభాతవార్త:
పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీలో అంగన్‌వాడి కేంద్రం దుస్థితికి చేరుకుంది. అధికారులు, నేతలు పట్టించుకోకపోవడంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడి సెంటర్ మరమ్మతులకు గురైంది. గత నెలలో వనదుర్గాపురం చలమరాజుల ఇండ్లు అంగన్‌వాడీ కేంద్రం అకస్మిక తనిఖీ చేయడానికి వచ్చిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంగన్‌వాడీ కేంద్రంలోని తలుపు, దాలబందరం ఊడిందని మరమ్మత్తులు చేయాలని, దీనికి దాతల సాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తన సొంత నిధులు వెచ్చించి అంగన్‌వాడీ కేంద్రాన్ని మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు పట్టించుకోకపోవడంతో పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ సెంటరు పంపాలంటే భయపడుతున్నారు. విషసర్పాలు సంచరించే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇకనైనా ఇచ్చిన హామీని నెరవేర్చాలని స్థానికులు సర్పంచ్‌ను కోరుతున్నారు.

## శ్రీ జలంతేశ్వరస్వామి ఆలయ నూతనఏడాది క్యాలండర్ల ఆవిష్కరణ.



పెద్దపంజాణి జనవరి 10 ప్రభాతవార్త :
పెద్దపంజాణి మండలం కోగిలేరుగ్రామ సమీపంలో వెలసిన స్వయంభు శ్రీ జలకంఠేశ్వర స్వామివారి ఆలయ నూతన ఏడాది క్యాలండర్‌లను ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులచే స్వామివారి సన్నిధానంలో పూజలు నిర్వహించి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ చరిత్ర,జలకంఠేశ్వర స్వామివారి చిత్రాలు, ప్రతినెల ఆలయంలో నిర్వహించే విశేషపూజలు, కార్యక్రమాల గురించి క్యాలండర్‌లో ప్రత్యేకంగా ముద్రించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు డాకా రంగమ్మ కుటుంబసభ్యులు డాకా శివశంకర్ రెడ్డి,డాకా వెంకటరెడ్డి,డాకా వరలక్ష్మిచెంగారెడ్డి,డాకా గౌతంరెడ్డి,డాకా శ్రావణ్ కుమార్ రెడ్డి,ఆలయ అర్చకులు కిరణ్ స్వామి,గ్రామస్తులు కిట్టప్ప,శివశంకర్ రెడ్డి,శివయ్య తధితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్
గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మాదకద్రవ్యాల వినియోగం వద్దు : సెబ్ సిఐ



కోట, జనవరి 10 ప్రభాతవార్త
మాదక ద్రవ్యాలను వినియోగించడం వల్ల ప్రాణహాని ఉందని వాకాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ప్రసన్నలక్ష్మి చెప్పారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రం పయనిస్తోందని, యువత మేల్కోవాలని, డ్రగ్స్ రహిత సమాజమే సంక్షేమానికి సంకేతమని ఆమె అన్నారు. మంగళవారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మాదవ ద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మాదవ ద్రవ్యాలను వినియోగించకూడదని, వీటిని వినియోగిస్తే కుటుంబాలు చిన్నాభిన్నంగా మారిపోతాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చదువుకున్న విద్యార్థులు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వివరించాలని సూచించారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు బానిసలైతే జీవితం అర్థాంతరంగా ముగిసిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వాకాడులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



వాకాడు, జనవరి 10, ప్రభాతవార్త
వాకాడులో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్‌ను వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసికంగా, ఉల్లాసంగా ఉండేందుకు శరీరానికి క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడల్లో పోటీతత్వం ఉండాలని అప్పుడే వారి ప్రతిభ బయటపడుతుందన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గాయం శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలంటే, మంచి ఆలోచనతో నైపుణ్యంతో ఆడాలన్నారు. గెలుపు ఓటముల అనేది సాధారణంగా ప్రతి క్రీడాకారుడు తీసుకోవాలన్నారు. అనంతరం ఇరువురికి నిర్వాహకులు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ ఆరు రోజులు వరకు ఉంటుందని, ఆరవ రోజు విజేతలకు నగదు, బహుమతులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

## కెజిబి తనిఖీ చేసిన ఎంఇఓ

దొరవారిసత్రం, జనవరి 10 ప్రభాతవార్త
దొరవారిసత్రం మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఇఓ దారా మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు, సలహాలిచ్చారు. ముందుగా పాఠశాలలో నాడు-నేడులో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్నితనిఖీ చేశారు.

## ఏకొల్లులో స్మశాన స్థలం కేటాయింపు

దొరవారిసత్రం, జనవరి 10 ప్రభాతవార్త
దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి సంబంధించి ఒక ఎకరా ప్రభుత్వ భూమిని స్మశానానికి కేటాయించారు. మండల సర్వేయర్ రామారావు, ఆర్ఐ స్వర్ణలత, వీఆర్‌ఓలు సర్పంచ్ ఆవుల బ్లెస్సీ ఆధ్వర్యంలో స్మశాన స్థలాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఆవుల బ్లెస్సీ మాట్లాడుతూ స్మశాన స్థలం కేటాయించడానికి సహకరించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్యకు, చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## స్వామిత్వ గ్రౌండ్ వాలిడేషన్ రికార్డుల పరిశీలన

కోట, జనవరి 10 ప్రభాతవార్త
కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం, తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ గ్రామ స్వామిత్వ గ్రౌండ్ వాలిడేషన్ సర్వే రికార్డులను గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ పరిశీలించారు. మంగళవారం ఆయన ఆయా పంచాయతీల్లోని ఆస్తులు, ఖాళీ స్థలాలు పరిశీలించారు. అందులో భాగంగా గ్రౌండ్ లెవల్‌లో తప్పిపోయిన ఇళ్లు, ఖాళీ స్థలాలు, రోడ్ల సర్వే పూర్తయిన తర్వాత గ్రామకంఠంలోని ఇంటి యజమానులకు ఆస్తి యాజమాన్య ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట మండల విస్తరణ అధికారి స్వరూపరాణి, నెల్లూరుపల్లి కొత్తపాలెం పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు, ప్రశాంత్, చైతన్య, సురేంద్ర, డివిజన్ రిసోర్స్‌పర్సన్ రాజశేఖర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నను ఆశీర్వదించండి : ఎమ్మెల్యే సంజీవయ్య



నాయుడుపేట రూరల్, జనవరి 10 ప్రభాతవార్త
దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆదరించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. నాయుడుపేట మున్సిపాలిటీలోని బిఎంఆర్ నగర్ సచివాలయం పరిధిలో మంగళవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య ఇంటింటికి వెళుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలపై ముద్రించిన బుక్‌లెట్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన ప్రజలకు చేరువ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, మండల వైసీపీ కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చదలవాడ కుమార్, సచివాలయ ఉద్యోగులు,

## వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తా : తంబిరెడ్డి

నాయుడుపేట, జనవరి 10 ప్రభాతవార్త
నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అభివృద్ధికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఛైర్మన్‌గా ఎంపికైన తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 12వ తేదీన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి తిరుపతి ఎంపీ గురుమూర్తిని ఆయన ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎఎంసి ఛైర్మన్‌గా ఎంపిక చేసిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే


తిరుపతి ఎంపీ గురుమూర్తిని ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తున్న తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి

కిలివేటి సంజీవయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఎల్లవేళలా సహకరిస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. తన సొంత నిధులనైనా వెచ్చించి మార్కెటింగ్ కమిటీని అభివృద్ధి చేసి రైతులకు మేలు చేకూర్చుస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 12వ తేదీన నాయుడుపేలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యాలయంలో జరిగే ప్రమాణ స్వీకారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఆయన వెంట వైసీపీ నాయకులు హరిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## యుటిఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశం



తడ, జనవరి 10 ప్రభాతవార్త
మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తడ మండల మహాసభ నూతన కౌన్సిల్ సమావేశం తడకండ్రిగలోని ఎంపిపి పాఠశాలలో జరిగింది. తడ మండల యుటిఎఫ్ అధ్యక్షులు కె.సుధాకర్ అధ్యక్షతన, తిరుపతి జిల్లా అధ్యక్షులు జికె రాజశేఖర్ పర్యవేక్షణలో నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయులు సి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ విద్యారంగం పట్ల ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంబిస్తోందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కనీసం జీతాలు కూడా 1వ తేదీన ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. పాఠశాలల విలీనం పేరుతో ప్రాథమిక విద్యావ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలైన డిఎ బకాయిలు, పిఆర్‌సి బకాయిలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తడ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు ఎన్.రామ్మూర్తి, అధ్యక్షులు కె.రాంబాబు, అసోసియేట్ అధ్యక్షులు కె.అరుణకుమారి, కెటి నవిన్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి ఎస్‌కె సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ని గద్దె దించితేనే రాష్ట్రానికి పట్టిన కర్మ పోతుంది
### - టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్‌నాయుడు



బాలాయపల్లి, జనవరి 10, ప్రభాతవార్త:
సీఎం జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించితేనే రాష్ట్రానికి పట్టిన కర్మ పోతుందని మండల టీడీపీ అధ్యక్షుడు దాసరి రాజగోపాల్‌నాయుడు తెలిపారు. కోటంబేడులో జరిగిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, టీడీపీ అధికార ప్రతినిధి కూని శ్రీహరి పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, మద్యం మాఫియా పెట్రేగిపోతుందని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్‌నాయుడు తెలిపారు. విద్య, వైద్యాన్ని సంక్షేమ పథకాలు వైసీపీ ప్రభుత్వం మరిచి వైసీపీ ఆగడాలు పరాకాష్టకు చేరుకున్నాయని టీడీపీ అధికార ప్రతినిధి కూని శ్రీహరి తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడాలని, టీడీపీని అధికారంలోకి తేవాలని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్‌నాయుడు తెలిపారు.

## రాంగోపాల్‌వర్మ దిష్టిబొమ్మ దగ్ధం



వెంకటగిరి, జనవరి 10, ప్రభాతవార్త:
కాపుల మనోభావాలు దెబ్బతినే విధంగా సినీ దర్శకులు రాంగోపాల్ వర్మ వ్యాఖ్యలు చేశారని వెంకటగిరి నియోజకవర్గ కాపు, బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోట కృష్ణయ్య మండి పడ్డారు. రాంగోపాల్ వర్మ దిష్టిబొమ్మను వెంకటగిరి తాలూకా కార్యాలయం కూడలిలో కాపు సంఘం నాయకులు దగ్ధం చేశారు. రాంగోపాల్ వర్మ వ్యాఖ్యలకు చిరంజీవి ఫ్యాన్స్ కూడా బాధపడుతున్నట్లు చెప్పారు. కాపులకు క్షమాపణ చెప్పకపోతే రాంగోపాల్‌వర్మ సినిమాలను అడ్డుకుంటామని చెప్పారు. రాంగోపాల్ వర్మ చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు తులసీదాస్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ రాజకీయ బదిలీ



వెంకటగిరి, జనవరి 10, ప్రభాతవార్త: వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా బి.వెంకట్రామయ్య నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మున్సిపాలిటీలో వెంకట్రామయ్య మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న గంగాప్రసాద్‌ను గుంటూరు మున్సిపల్ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోమని ఉత్తర్వులు పేర్కొన్నారు. కాగా మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌ను వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బదిలీ చేసినట్లు నాయకులు చర్చించుకుంటున్నారు. రాంకుమార్‌రెడ్డి కమిషనర్‌గా వెంకట్రామయ్య నియమించాలని సిఫార్స్ లేఖ ఇచ్చినట్లు తెలిసింది. వైసీపీ సమన్వయకర్తగా రాంకుమార్‌రెడ్డి ఆయనకు అనుకూలమైన అధికారులను నియమించుకోనున్నట్లు తెలిసింది. మొదటగా మున్సిపల్ కమిషనర్‌ను బదిలీ చేయించారు.

## కూలీల ఉపాధికి సిగ్నల్ గండం

కోట, జనవరి 10 ప్రభాతవార్త
గ్రామాల్లో ఇంటర్నెట్ సమస్య పేదల ఉపాధికి ప్రతిబంధకంగా మారుతోంది. సిగ్నల్స్ సమస్యతో అనేక చోట్ల యాప్ ద్వారా హాజరు నమోదు, ఫొటో తీసి అప్‌లోడ్ చేయడం కష్టతరమవుతోంది. ఈ కారణంగా పనులకు హాజరైనా వేతనాలు అందే అవకాశం లేదన్న సమాచారంతో కూలీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1200కు పైగా గ్రామాల్లో సిగ్నల్స్ సమస్య ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఈ నెల 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా జాతీయ మొబైల్ పర్యవేక్షణ విధానం యాప్ వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ విధంగా వచ్చిన హాజరునే ప్రామాణికంగా తీసుకొని కూలీలకు కేంద్రప్రభుత్వం వేతనాలు చెల్లించనుంది. వారంరోజులుగా కూలీలు పనులకు హాజరవుతున్నా యాప్‌లో నమోదు కావడం లేదు.

# తిరుపతి డివిజన్

## పింఛన్లు తొలగించి ప్రాణాలు తీస్తున్నారు : గాలి భానుప్రకాష్



నగరి, జనవరి 10 ప్రభాతవార్త: పింఛన్ తొలగించి సచివాలయం చుట్టూ తిరిగి మనోవేదనతో మానసిక ఒత్తిడికి గురై మృతి చెందిన నగరి మున్సిపాలిటీ ఏకాంబరకుప్పంకు చెందిన ఎం.రామస్వామి(87) కుటుంబ సభ్యులను పరామర్శించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏ రోజు ఎవరి పింఛన్లు తీసేస్తారో అని ఆందోళన చెందుతున్నారని, పనికిమాలిన నిబంధనలు పెట్టి పేద ప్రజల పింఛన్లు నిర్దాక్షిణ్యంగా తొలగిస్తూ వారి కడుపు కొడుతున్నారు. రామస్వామి మృతికి ప్రభుత్వమే కారణమని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో ఇష్టారీతిన కరెంటు చార్జీలు, ఇంటి పన్నులు పెంచేస్తున్నారు. ఈ ప్రభుత్వం ఇంటికి పోవడం, తెలుగుదేశం రావడం కాయమని, అధికారంలోకి వచ్చాక తొలగించిన పింఛన్లు, రేషన్‌కార్డులు పునరుద్ధరణ చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, పెరుమాళ్, నీలమేఘం, రజనికాంత్, కరుణ, మాణిక్యం వాసు, నటరాజన్, దయాళన్, శేఖర్, జయవేలు, అన్సారీలు పాల్గొన్నారు.

**దళితుల 7వేల కోట్లు దారి మళ్లించిన వైసీపీ సర్కార్ : గాలి భానుప్రకాష్**

దళితుల ఆర్థికాభివృద్ధికి ఖర్చు పెట్టాల్సిన ఎస్సీ కార్పొరేషన్ నిధులు రూ.7 వేల కోట్లు దారి మళ్లించి తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వంకు బుద్ధి చెప్పాలని నగరి టీడీపీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్ కోరారు. మంగళవారం నగరి రూరల్ మండలం తెరణి, మూలనత్తం పంచాయతీల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. అంబేద్కర్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తూ దళితుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన డబ్బులు దారి మళ్లించి ద్రోహం చేస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారు. నాడు 50 ఏళ్ళకే డప్పు కళాకారులకు ఎస్టీలకు పింఛన్ ఇచ్చి ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. చంద్రన్న పెళ్లి కానుక, సంక్రాంతి కానుకలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత యువతకు సబ్సిడీ రుణాలు ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకంలో రెండు న్నర లక్షల రూపాయలు ఇచ్చి ఇళ్లు నిర్మించారు. అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా విదేశాల్లో చదువు కోవడానికి ఆర్థిక సాయం అందిస్తే వైసీపీ పాలనలో రద్దు చేశారని తెలిపారు. టీడీపీని గెలిపించి ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్సీ కార్పొరేషన్ నిధులు, 27 పథకాలను తిరిగి అనుభవించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, రాష్ట్ర టీఎన్‌టీయూసీ సెక్రటరీ బాలాజీ, తెలుగు మహిళా రాష్ట్ర అధికారప్రతినిధి మీర, శ్రీనివాసులురెడ్డి, బాల సురేష్, గుణశేఖర్, కనకరాజ్, పయణి, జనార్ధన్, మణిరెడ్డి, రాజేంద్ర, మునస్వామి, తమిళరసన్, నారాయణన్, కన్నాయనం, మురళి పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో పాలిటెక్నిక్ క్రీడాకారుల అద్భుత విజయాలు



చంద్రగిరి, జనవరి 10 ప్రభాతవార్త: 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ రీజినల్ స్థాయి పోటీలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు అద్భుత విజయాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ యం.ఎస్.సుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ఆవరణలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు (ఉమ్మడి) జిల్లాలోని 24 పాలిటెక్నిక్ కళాశాలల నుండి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో మన కళాశాల నుండి టి.చార్మి, ఏ.అనురాధ, టిటి డబుల్స్‌లో మొదటి స్థానం, ఎస్.కృష్ణసాయి, జె.మునితేజేష్ యాదవ్ టిటి డబుల్స్‌లో మొదటి స్థానం, కె.ఆదిత్య చెస్‌లో ద్వితీయ స్థానం ఏ.భానుప్రకాష్ ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానం, బి.గురు శుశాంత్, కె.రవికుమార్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం, వాలీబాల్ పోటీలలోనూ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ క్రమంలో క్రీడాకారులను ఆయన అభినందించారు.

## ఐదు దశాబ్దాల సమస్యకు తహశీల్దార్ శిరీషా పరిష్కారం



చంద్రగిరి, జనవరి 10 ప్రభాతవార్త: ఐదు దశాబ్దాల సమస్యకు తహశీల్దార్ శిరీషా 3 రోజుల్లో చక్కటి పరిష్కారం చూపించడంతో అముదాలకోన (ఎస్టీలు) ప్రజలు కృతజ్ఞతలతో చేతులు జోడించి నమస్కరించారు. వివరాల్లోకెళితే.. ప్రస్తుతం మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు వెళితే ఒక పట్టాన పరిష్కారం లభించడం లేదనే ఆవేదన సర్వత్రా నెలకొంటున్నది. అది ఎటువంటి వివాదమైనప్పటికీ పోలీస్ స్టేషన్ చుట్టూ కాళ్ళరిగేలా ప్రదక్షిణ చేయాలనే భావన ప్రజల్లో నాటుకుపోయింది. పోలీసు అధికారులు నిత్యం బందోబస్తులకో, భద్రతలకో, సెలవుపై వెళ్ళిపోతుండటమో జరుగుతుండటంతో ఎక్కడి సమస్యలు అక్కడే మొరాయిస్తున్నట్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ శిరీషా (మహిళా అధికారిణి) బాధిత ప్రజల ఇబ్బందులపై డిప్యూటీ తహశీల్దార్లు ఈశ్వర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, అమృత, సర్వేయర్ పురుషోత్తం రెడ్డి. ఆర్ఐలు సులోచన, విఆర్ఓ వెంకన్న నాయుడుతో సమీక్షించుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న తీరు పట్ల ప్రశంసలు లభిస్తున్నాయి. ఇందదులో భాగంగా ఆముదాలకోన ప్రజలకు శ్మశాన వాటిక సమస్య పరిష్కారంపై ఆమె దృష్టి సారించారు. మూడు రోజుల పాటు సునిశిత పరిశీలన గావించి కల్‌రోడ్ పల్లి గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 512/1సి -0.42 సెంట్లు భూమిలో 0.30 సెంట్లు భూమిని శ్మశాన వాటికకు కేటాయించారు. దీంతో 50 ఏళ్ళ శ్మశాన వాటిక సమస్యకు పరిష్కారం చూపిన తహశీల్దార్‌కు ప్రజలు నీరాజనాలు పలికారు.

## కోడి పందాలు పూర్తిగా నిషిద్ధం : డీఎస్పీ

రేణిగుంట, జనవరి 10 ప్రభాతవార్త: ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు కోడి పందేలు పూర్తిగా నిషిద్ధమని రేణిగుంట డీఎస్పీ రామచంద్ర తెలిపారు. పండుగ సెలవులకు ఊర్లకు వెళ్లేవారు తప్పకుండా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌ల్లో తెలియజేయాలన్నారు. భద్రత కోసం ఊర్లకు వెళుతున్న వారి ఇళ్ళ వద్ద ఎల్‌హెచ్‌ఎంఎస్‌కెమెరాలు ఉచితంగా ఏర్పాటు చేస్తారన్నారు. తప్పని సరిగా ఇంట్లో ఉన్న విలువైన బంగారు నగలు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. ప్రయాణాలు చేసేటప్పుడు డబ్బు, నగలు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో అర్బన్ సీఐ సుబ్బారెడ్డి, రూరల్ సీఐ ఆరోహణరావు, ఏర్పేడు సీఐ శ్రీహరి, అర్బన్ ఎస్ఐ ఈశ్వరయ్య, గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి, ఏర్పేడ్ ఎస్ఐ రఫీ,సిబ్బంది ద్వారా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## యువశక్తి గోడపత్రికలు విడుదల

రేణిగుంట, జనవరి 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినుత కోటా మంగళవారం యువశక్తి గోడపత్రికలను రేణిగుంటలో విడుదల చేశారు. జనవరి 12వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని జన సైనికులకు పిలుపునిచ్చారు. అనంతరం గోడ పత్రికలను ఆటోలకు అంటించి, ప్రయాణికులకు అందజేశారు. శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు దండి రాఘవయ్య, నియోజకవర్గ కార్యదర్శి పాలురు మునికుమార్, నాయకులు భాగ్యలక్ష్మి, త్యాగరాజులు, జ్యోతికుమార్, గంగ, గిరీష్, ముకేష్, సుధాకర్, అబ్బులురెడ్డి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణా చేస్తే అర దండాలు తప్పవు



రేణిగుంట, జనవరి 10 ప్రభాతవార్త: రైళ్ళలో నిషేధిత పదార్థాలను అక్రమ రవాణా చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్ హెచ్చరించారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు పలు రకాల నేర పూరిత అక్రమ రవాణాకు పాల్పడకూడదనే అంశాలపై మంగళవారం రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఏఎస్‌సీ రాజు పర్యవేక్షణలో ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. నిషేధిత ఉత్పత్తులు, మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలు, రవాణా చేయడం నేరమని మధుసూదన్ తెలిపారు. ఎస్ఐ రాంబాబుతో రైలు ప్రయాణ సమయాల్లో అపరిచితులను నమ్మకూడదనే విషయాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. రైల్వేశాఖ ప్రయాణికుల సౌకర్యార్థం నేరాలు తగ్గించడానికి 139, 100, 1098 టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తెచ్చిందని రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ నంబర్లను వినియోగించుకుంటే రైల్లో ఉన్న ఆర్‌పిఎఫ్ సిబ్బంది, రైల్లో లేనప్పుడు తరువాతి దేశంలో వారు మన ముందు ప్రత్యక్షమై సహాయపడతారని మధుసూదన్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ ఎన్నో సేవలు వినియోగంలోకి తెచ్చిందని ప్రయాణికులు కూడా రైల్వేలను తమ సొంత ఆస్తులుగా భావించి కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

## ప్రసూతి మరణాలు తగ్గించేందుకు శిక్షణా కార్యక్రమం

తొట్టంబేడు, జనవరి 10 ప్రభాతవార్త : కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐసిడిఎస్ మరియు వైద్యశాఖ సిబ్బందితో సంయుక్తంగా ప్రసూతిమరణాలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారి కాన్పుతేదీకి ఒక వారం ముందే ఆశ, ఎఎన్ఎంలు రెఫరల్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేయించి ప్రసవం చేయించాల్సిందిగా సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, అమ్మన్నమ్మ, పిహెచ్ఎన్ శాంతకుమారి, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## చోరీలపై అప్రమత్తంగా ఉండండి: సిఐ అంజూయాదవ్



శ్రీకాళహస్తి,జనవరి 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుత సీజన్లో దొంగలు హల్‌చల్‌చేసే ప్రమాదం ఉందని అయితే ప్రజలు పోలీసులతో సహకరించాలని అర్బన్ సిఐ అంజూ యాదవ్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పలువురికి చైతన్య వంతుల్ని చేయటానికి సమావేశం నిర్వహించారు.ఇళ్ల యజమానులు బయట ప్రయాణాలు వెళ్ళే టప్పుడు సురక్షితంగా ఉండాలంటే లాక్‌డ్ హౌస్ మెనిటరింగ్‌సిస్టమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకోవాలని సూచించారు.షాపు యజమానులు ఎట్టి పరిస్థితిలోనూ దుకాణాల్లో నగదు పెట్టరాదన్నారు.

## కోడిపందెం రాయుళ్ల అరెస్టు

తొట్టంబేడు, జనవరి 10 ప్రభాతవార్త : మండలంలోని కారాకొల్లు గ్రామంలో కోడిపందేలు జరుగుతున్నాయని సమాచారం అందుకున్న తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని కోడిపందేలు నిర్వహిస్తున్న బుచ్చినాయుడుకండ్రిగ మండలం పల్లమాల గ్రామానికి చెందిన ఇద్దరు, బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన ఒకరు, శ్రీకాళహస్తికి చెందిన ఒకరిని అరెస్టుచేసి వారి నుంచి రెండు కోళ్ళు,, రూ.1200నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మైనర్ బాలికపై వేధింపుల కేసులో నిందితుడికి రిమాండ్

సత్యవేడు, జనవరి10 ప్రభాతవార్త: మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో ముద్దాయిపై ఫోక్సో చట్టం క్రింద మంగళవారం సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సిఐ శివకుమార్ రెడ్డి తెలిపిన సమాఛారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వేంకట రాజుల కండ్రిగ పంచాయితీలో బాలక్రిష్ణ(50) అనే వ్యక్తి ఓ మైనర్ బాలికపై లైంగిక వైధింపులకు గురిచేసినట్లు ఈనెల8న పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో ఎస్ఐ పురుషోత్తం రెడ్డి ప్రాథమిక విఛారణ చేపట్టారు. బాలక్రిష్ణ నిజంగానే వైధింపులకు గురిచేసినట్లు రుజువు కావడంతో అతనిపై ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ సత్యవేడు సర్కిల్ పరిధిలో ఎవరైనా మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. సమాఛారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడమే కాకుండా, వేధింపులకు కారణమౌతున్న వారిపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

## ముందస్తు పండుగ వేడుకల్లో విద్యార్థులు

శ్రీకాళహస్తి, జనవరి 10 ప్రభాతవార్త : హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ అన్ని వర్గాల ప్రజలు జరుపుకునే అద్వితీయమైన పండుగలే మన తెలుగువారి తొలిపండుగ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు అని డిఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్, ట్రాఫిక్ సిఐ వెంకటప్పలు అన్నారు. పట్టణంలోని భాష్యం ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను జోనల్ ఇన్‌ఛార్జి ఎల్.లక్ష్మణరావు ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించుకున్నారు.

## రాష్ట్రం నుండి నిరంకుశ పాలనను తరిమికొట్టాలి



తిరుపతిరూరల్, జనవరి 10 ప్రభాతవార్త: రాష్ట్రం నుండి నియంతృత్వ, నిరంకుశ పాలనను తరిమికొట్టాలని తిరుపతిరూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు, చంద్రగిరి టిడిపి ఇన్‌చార్జ్ పులివర్తి నాని ఆదేశాల మేరకు మంగళవారం మల్లంగుంట గ్రామ పంచాయతీలో పార్టీ శ్రేణులతో కలిసి 'ఇదేం ఖర్మ- మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సభలు, సమావేశాలకు జన ప్రభంజనాన్ని చూసి ఓర్వలేకనే రాష్ట్రంలో చీకటి జీవోలను అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెలసరి జీతాలు ఇవ్వలేని జగన్ సర్కార్, పార్టీ మనుగడను ఏమి కాపాడుకుంటుందని ఏద్దేవ చేసారు. మల్లంగుంటలో ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే తిరిగి టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు క్రిష్ణమూర్తిరెడ్డి, మునిశేఖర్, దిలీప్‌యాదవ్, ఆదినారాయణ, సురేష్, మురగ, వేణు, వరదరాజులు, చిరంజీవి, మణి టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

## ఎంఎస్ రాజును వెంటనే విడుదల చేయాలి

**- టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దశరథ వాసు డిమాండ్**



నింద్ర, డిసెంబరు 10 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజును వెంటనే విడుదల చేయాలని, లేకుంటే కోర్టులో హాజరు పరచాలని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దశరథవాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దశరథ వాసు మీడియాతో మాట్లాడారు.టీడీపీ స్టేట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు కావలిలో దళితులు కరుణాకర్, తేజ, హర్షలపై జరిగిన హత్య,హింస దౌర్జాన్యానికి శాంతి యుతంగా నిరసన కార్యక్రమం చేయడానికి వస్తుంటే పోలీసులు అర్ధరాత్రి అటవీ ప్రాంతంలో ఎంఎస్ రాజును అక్రమంగా అరెస్టు చేయడానికి ఆయన ఖండించారు. అరెస్టు చేసి 20 గంటలు దాటిన ఇంత వరకు అతని ఆచూకిఇ తెలియక పోవడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల పట్ల చిన్న చూపు చూస్తూ వారి మాన ప్రాణాల రక్షణలో పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు బ్రతకడానికి వైసీపీ రౌడీలు, గుండాలపై ఆధారపడే పరిస్థితి ప్రభుత్వమే కల్పించడం దారుణమ న్నారు. దళిత ప్రజలందరూ వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న హత్యా, హింస, దౌర్జాన్యాలను గమనిస్తూ ఉన్నారన్నారు. 2024లో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసి, నిర్బందిస్తున్న ఎంఎస్ రాజును వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంఎస్ రాజుకు ఏమైనా జరిగితే సీఎం జగన్, డీజీపీలు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## పేకాట, కోడిపందాలు ఇతర కార్యక్రమాలు చేపడితే కఠిన శిక్ష

పుత్తూరు రూరల్, జనవరి 10 ప్రభాతవార్త: పుత్తూరు మండలం రామకృష్ణా పురం సచివాలయం వద్ద సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, పేకాట, ఇతర నృత్యాలు చేపట్టరాదని ఎస్ఐ గౌరిశంకర్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సంక్రాంతి పండుగకు ఎవరైనా పేకాట, కోడి పందాలు, ఇతర కార్యక్రమాలు ఆడితే సమాచారం ఇవ్వాలని కోరారు. నిబంధనలు పాటించకపోతే ఎవరిని ఉపేక్షించేది లేదని వారికి కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విరిత, మెడికల్ ఆఫీసర్ డా. చైతన్య, వైసీపీ నాయకుడు దేవేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముని నరేష్‌కుమార్, సంఘమిత్రలు, ఆశ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ జట్టుకు వశిష్ట విద్యాలయ పాఠశాల విద్యార్థులు ఎంపిక

పుత్తూరురూరల్, జనవరి 10 ప్రభాతవార్త: రాష్ట్ర స్థాయి బాలుర బాల్ బ్యాడ్మింటన్ జట్టును ఎంపిక చేసిన నేపథ్యంలో అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి బాలుర బాల్ బ్యాడ్మింటన్ జట్టుతో ఎంపికైన వశిష్ట విద్యాలయ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఎంపికైన కె.సి.తేజేష్, సి.భానుప్రకాష్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యం రాజరాజేశ్వరి, జయచంద్రారెడ్డి, పీఈటీ సతీష్, గీత విద్యార్థులను అభినందించారు.

**అడిగిన వారందరికి ఉపాధి పనులు:**

అడిగిన వారందరికి ఉపాధి పనులు కల్పించినట్లు ఎంపీపీ మునివేలు అన్నారు. మంగళవారం పుత్తూరు మండలం వేపగుంట సచివాలయంలో సర్పంచ్ గిరిజ ప్రసాద్ అధ్యక్షతన ఉపాధి గ్రామసభ నిర్వహించారు. రోజుకు కనీసం రూ.257 వేతనం అందుతుందన్నారు. పంచాయతీకి ఉపయోగపడే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం పంచాయతీలో పనులను గుర్తించారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ:**

గత రెండు రోజుల క్రితం తిరుపతి రూరల్ తుమ్మలగుంట సమీపంలో టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో పుత్తూరు మండలం వేపగుంట ఏడబ్ల్యుకి చెందిన తల్లి కుమారుడు మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ మునివేలు, సర్పంచ్ గిరిజాప్రసాద్ పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో భార్గవి, పంచాయతీ కార్యదర్శి నాగమణి, సచివాలయం కన్వీనర్ నరసింహులు, పుష్ప, ఫీల్డ్ అసిస్టెంట్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదవ జాతీయ రాకెట్ బాల్

## ఛాంపియన్ షిప్ విజేత సభ్యులకు ఘన సన్మానం



వెదురుకుప్పం, జనవరి 10 ప్రభాతవార్త : తొమ్మిదవ జాతీయ రాకెట్ బాల్ ఛాంపియన్ షిప్ బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలవడంతో జట్టు సభ్యులను జిల్లా తెలుగు దేశం పార్టీ మాజీ కార్యదర్శి మోహన్ మురళి ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో మంగళవారం విజేత సభ్యులను దుశాలువ, పుష్పగచ్ఛలతో ఘనంగా సన్మానించి తనకు క్రీడలపట్ల ఉన్న మక్కువను, క్రీడకారులపట్ల ఉన్న గౌరవంను చాటుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీ ణ స్థాయి క్రీడకారులు పట్టుదల, కృషితో జాతీయ స్థాయిలో రాణించి గుర్తింపు తెచ్చుకోవడం గర్వంగా ఉందన్నారు. జనవరి 6 నుంచి 8 వరకు మహారాష్ట్ర లాతూర్ నందు జరిగిన పోటీలలో పాల్గొన్న పదహారు రాష్ట్రల జట్టులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలవగా, కర్ణాటక రాష్ట్రం రెండవ స్థానంలో నిలువుగా పాండిచ్చేరి మూడవ స్థానంలో నిలిచిన్నట్లు చెప్పారు. పోటీలో పాల్గొని గుర్తింపు పొందిన వెదురుకుప్పం క్రీడకారులు హేమాద్రి రెడ్డి, వెంకటేష్, రాజా, కుమార్, పురుషోత్తం, రాజు, గజేంద్రరాజులను సన్మానించి ఘనంగా అభినందించారు.విజయం సాధించడంకు కారణమైన కోచ్ నాగభూణంను అభినందించారు. ఈ కార్యక్రమంలో యువత కిరణ్ యాదవ్, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హాకీలో ప్రతిభ కనబరిచిన కేంబ్రిడ్జ్ స్కూల్ విద్యార్థి

తిరుపతి (క్రీడ), జనవరి 10 ప్రభాతవార్త :తిరుపతిలోని బాలాజీ కాలనీలోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్. ఇర్ఫాన్ అనే విద్యార్థి రాష్ట్ర, జాతీయ స్థాయి హాకీ పోటీలలో ఉత్తమ ప్రతిభ సాధించాడు. గత నెల విశాఖ పట్నంలో జరిగిన సబ్ జూనియర్ హాకీ పోటీలలో ఉత్తమ క్రీడా ప్రతిభ అవార్డు పొంది అలాగే జాతీయ స్థాయికి ఎంపికైయ్యాడు. నంద్యాల పట్టణంలో ఈ నెల 23 నుంచి 25వ తేది వరకు జరుగుతాయన్నారు. ఈ విద్యార్థికి కేంబ్రిడ్జ్ పాఠశాల కరెస్పాండెంట్ కె. కల్పన, హెచ్ఎంవసుబాల,పిఇటిలుమురళి,శ్రీనివాసులు,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

## పనులలో నాణ్యతాప్రమాణాలు పాటించండి.



రామచంద్రాపురం, జనవరి 10 ప్రభాతవార్త: ఉపాధి హామీ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిం చాలని డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. మంగవారం నెత్తకుప్పంలో పొలం సరిహద్దు కందకాల పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో ముఖాముఖీ చర్చించారు. పని ప్రదేశంలో ఫోటోలు తీసి హాజరు నమోదు చేయాలని క్షేత్ర సహాయకుడు పురుషోత్తంను ఆదేశించారు. పని పుస్తకం కలిగిన కూటుంబాలకు వంద పనిదినాలను కల్పించాలన్నారు. 5 సంవత్స రాలు పైబడిన మామిడి తోటల్లో మొక్కచుట్టూ పాదులు తీసే పనులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ హంసవేణి, టిఏల ఆరోగ్య, సుదర్శన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు జాబ్ క్యాలెండర్ ఎక్కడ సిఎం గారూ..!

**-తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు**

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 10 ప్రభాతవార్త: తాము అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల 30 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేస్తామని యువతను నమ్మబలికి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, ప్రతి జనవరి నెలలో విడుదల చేస్తామన్న జాబ్ క్యాలెండర్ ఎక్కడ జగన్‌రెడ్డి అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిని నిలదీశారు.మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన తెలుగు యువత నాయకులతో కలిసి మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు రాక జీవితాన్ని ఎలా లీడ్ చేయాలో తెలియక సతమతమవుతున్నారని అన్నారు. పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి రాగానే ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆ ఊసేలేదన్నారు. సమావేశంలో తెలుగు యువత తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌పి.శ్రీనివాసులు, నియోజకవర్గ అధ్యక్షుడు కరణం సందీప్, శ్రీనివాస్ యాదవ్,సుభాష్,సంతోష్ రాయల్, లోకేష్, రఫి, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో కోడిపందేలు నిషేధం

తొట్టంబేడు, జనవరి 10 ప్రభాతవార్త : సంక్రాంతి సంబరాల్లో కోడిపందేలు, జూదం నిషేధించినట్లు తొట్టంబేడు ఎస్ఐ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎస్పి పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ దృష్ట్యా మండలంలో కోడిపందేలు, పేకాట మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కోడిపందేలు జరిగే ప్రాంతాలను ఎవరైనా తమకు తెలియజేస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అంతేకాకుండా పండుగకు ఇతర ప్రాంతాలకు వెళ్ళే వారు పోలీసులకు తప్పకసమాచారాన్నిఅందిస్తే సంబంధిత ప్రాంతాల్లో గస్తీని పెంచుతామన్నారు.

## గర్భిణీస్త్రీలు, బాలింతలు వైద్యసలహాలు పాటించాలి



తొట్టంబేడు, జనవరి 10 ప్రభాతవార్త : గర్భిణీస్త్రీలు, బాలింతలు, వైద్యసలహాలు తప్పక పాటించాలని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రమేష్ అన్నారు. సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విచ్చేసిన గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అవసరమై అన్ని రకాల పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేయడంతో పాటు ఆశావర్కర్లు, ఎఎన్ఎంలకు, హెల్త్‌సూపర్ వైజర్ కామరాజు కిల్కారి మొబైల్ అకాడమీ గురించి వివరించారు. భారత ప్రభుత్వం నంబర్ 012445 8000 ద్వారా విధిగా గర్భవతులకు, బాలింతలకు, ఆశాకార్యకర్తలకు వాయిస్‌కాల్ ద్వారా ముఖ్య సూచనలు, సలహాలు ఇస్తూ అవగాహన కల్పిస్తుందన్నారు. హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు మాట్లాడుతూ గర్భం ధరించిన ప్రతి స్త్రీకి నాలుగవనెల నుంచి బిడ్డకు ఏడాది వచ్చే వరకు 72వారాల పాటు కిల్కారి తన సేవలను ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, ఆశాకార్యకర్తలు, ఎఎన్ఎంలు, పిహెచ్ఎన్ సంపూర్ణ, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

## నైట్ సెంటర్‌ను తనిఖీ చేసిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 10 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని పట్నూల్ వీధిలో గల రాత్రి బస కేంద్రంను నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కేంద్రంలో కల్పిస్తున్న మౌళిక వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో నాణ్యమైన భోజన వసతి, వైద్య సదుపాయాలు బాగా ఉండేటా చూడాలన్నారు. అలాగే మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మంచాలు, బెడ్లు కూడా బాగుండేలా చూడాలన్నారు. ఈ నెల 11న సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ న్యూ డీల్లో నుండి వచ్చి ఈ కేంద్రాన్ని తనిఖీ చేయనున్నారన్నారు. ఈ సందర్భంగా సెంటర్‌ను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ బస్వా గీత, నగర పాలక సంస్థ ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మెప్మా పిడి రాధమ్మ, డిఈ గోమతి, సోషల్ వెల్ఫేర్ డి.డి చంగయ్య, హోప్ సంస్థ ప్రతినిధి కవిత, మెప్మా సిఎంఎం రమణ, సోమశేఖర్, శ్రీరాములు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## శివయ్యసేవలో ఉత్తర ప్రదేశ్ మంత్రి పూజలు

శ్రీకాళహస్తి,జనవరి 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిథుల తాకిడి పెరుగుతుంది. మంగళవారం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మంత్రి సురేష్‌రాయి కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి ఎఇఓ సతీష్‌మాలిక్ ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలుఅ ందించారు. సతీష్‌మాలిక్ స్వామిఅ మ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



శ్రీకాళహస్తిరూరల్, జనవరి 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం మునగల పాళెం, అరుంధతి వాడకుచెందిన కొందరు ఆనారోగ్యంతో మృతి చెందారు.ఆ కుటుంబాల గురించి పార్టీ నాయకులు శాసన సభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారికి ఆర్థిక సహాయం అందించుటకు నిర్ణయించారు.ఈ మేరకు మృతులు సి.ఈశ్వరయ్య, సి.సుబ్బ య్య, టి.గోపిలు అనారోగ్యంతో మరణించారు.వారి కుటుంబసభ్యులకు పరామర్శించి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందించారు.

## పండుగలు తెలుగుసంస్కృతి సంప్రదాయాలకు నిలయాలు



శ్రీకాళహస్తి, జనవరి 10 ప్రభాతవార్త : పండుగలు మన తెలుగుసంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని అర్బన్ సిఐ అంజూయాదవ్ అన్నారు. స్థానిక ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్బన్ సిఐ అంజూయాదవ్, ఎంఈవో భువనేశ్వరిలు విచ్చేశారు. కార్యక్రమానికి పాఠశాల అధ్యక్షులు లేబాకుమంగిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా అర్బన్ సిఐ మాట్లాడుతూ చిన్నతనం నుంచే తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థినీ విద్యార్థులకు నేర్పాలని తల్లిదండ్రులు కూడా వాటినే ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఏడాది తెలుగువారి తొలిపండుగ భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతల గురించి వివరించారు. అనంతరం చిన్నారులు హరిదాసు, పంచాంగశ్రవణం, కోలాటాలు, డంబెల్స్, జానపద పాటలకు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి, తల్లిదండ్రులు కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, పూర్వ ఆచార్జీ మాతాజీలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



రేణిగుంట, జనవరి 10 ప్రభాతవార్త: ప్రగతి సంస్థ రేణిగుంట మండలం రేణిగుంట బాలుర, రేణిగుంట బాలికలు, గుత్తివారిపల్లె ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం క్రీడా సామగ్రి పంపిణీ చేసింది. మండల కో-ఆర్డినేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ క్రై సంస్థ, బెంగళూరు సహాయంతో ప్రగతి సంస్థ క్రీడా పరికరాలు పంపిణీ చేశామన్నారు. పిల్లల శారీరక ఎదుగుదలకే కాకుండా మానసిక వికాసానికి కూడా క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, శైలజ, ప్రసాద్, ఉపాధ్యాయులు రాజశేఖర్, రామ్మోహన్, తేజస్విని, పూర్ణిమ, ధనపాల్, ప్రగతి సిబ్బంది శిరీష, నీరజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి : సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, జనవరి 10 ప్రభాతవార్త : అరాచక, అవినీతి వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నరసింహ యాదవ్‌లు అన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌లు ఇచ్చిన పిలుపుమేరకు సూచన లతో మంగళవారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 34వ వార్డు బిపి అగ్రహారంలో వార్డు ఇన్‌ఛార్జులు కన్నావరంహరిబాబు, మురళీ, ఎంఎస్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. ముందుగా సుధీర్‌రెడ్డి ఇక్కడ ఉన్న నాగాలమ్మ పుట్టవద్ద పూజలు నిర్వహించుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి వార్డులోని ప్రతి ఇంటికి వెళ్ళి వారికి పలకరిస్తూ గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, కరెంటు బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు బాదుడు వంటివి వివరించారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులు, విద్యుత్తు బిల్లులు, ఇసుక, ఇంటి పనులు, మహిళలకు భద్రత, మూడు రాజధానులు కావాలా ఒక్క రాజధాని కావాలా తదితర విషయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలుగా నష్టపోయామని చివరికి అర్హత ఉన్న వారి ఫించన్లు, రేషన్‌కార్డులు కూడా తొలగించారని సుధీర్‌రెడ్డి దృష్టికి ప్రజలు తెచ్చారు. అరాచక వైకాపా ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈనెల 27 నుంచి నారాలోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర కొనసాగనుంద న్నారు. అనంతరం మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పుదూరు లక్ష్మణరెడ్డిని ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శి ంచారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి బి.రేణుకమ్మ, టిఎన్‌ఎస్‌ఎఫ్ మాజీరాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమేష రావు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు సుబ్రమణ్యం (బుజ్జి), తిరుపతి పార్లమెంటు రైతు నాయకుడు ప్రకాష్‌నాయుడు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, శ్రీలక్ష్మి, దుర్గమ్మ,ఊహ, షాకిరాలీ, ఆర్ముగం, బషీర్, సుబ్బయ్య, సుబ్రమణ్యం, మణి, యాదగిరి, కాసరం రమేష్, షాజహాన్, ఖాదర్ బాషా, డివినారాయణ, అస్మత్, గోపి, మిన్నల్‌రవి, వజ్రంకిషోర్, ఆర్ముగం, దొరబాబు, ఎంఎస్‌రెడ్డి, కెవి.ప్రతాప్, సాయి, జిలానీబాషా, చాంద్‌బాషా, రామకృష్ణయాదవ్, సన్నీ, కోబాకలక్ష్మణ్, సురేష్ నాయుడు, రవీందర్‌నాయుడు, మునిరాజయాదవ్, బాబురెడ్డి, పురుషోత్తంనాయుడు మరియు తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి



సత్యవేడు, జనవరి10, ప్రభాతవార్త: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని రాజగోపాలపురం గ్రామం వద్ద మంగళవారం ఉదయం వేకువ జామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇంద్రాణమ్మ(75) దినచర్యగా ఆరుబయటకు వెళ్ళి వస్తూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు స్థానిక పోలీస్‌లకు, మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**వృద్ధురాలి మృతికి క్వారీ లారీలే కారణం...గ్రామస్తుల ఆరోపణ**

మృతురాలు ఇంద్రాణమ్మకు ఒక కుమార్తె,ఇద్దరు కుమారులు ఉన్నారు.వీరందరూ ఉద్యోగరీత్యా బయట ప్రదేశాలకు వెళ్ళడం, ఆమె భర్త సుబ్రమణ్యం శెట్టి గతకొన్నేళ్ళకు మునెపే మరణించడంతో ఒంటరి మహిళాగా జీవిస్తున్నది. ఈనేపధ్యంలో మంగళవారం ఉదయం ఆమె రోడ్డు ప్రమాదంలో మరణించడం భాదకరంగా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువైపుగా కంకర క్వారీ లారీలు తప్పా మరేటువంటి ఇతర వాహనాలు వచ్చే వీలులేదని గ్రామస్తులు చెపుతున్నారు. రెండు కంకర లారీ ఒకేవైపు ప్రయాణిస్తూ ఒకదానినోకటి అతివేగంగా అధిగమించే క్రమంలో రోడ్డు ప్రక్కన ఉన్న ఇంద్రాణమ్మను ఢీకొన్నట్లు గ్రామస్తులు ఆరోపణ చేస్తున్నారు. కంకర క్వారీ లారీలు ఆగడాలను అరికట్టే దిశగా పెద్దఎత్తుంన నిరసనలు వ్యక్తం చేయనున్నటు గ్రామస్తులు తెలిపారు.

## రూ.13లక్షలతో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ



తొట్టంబేడు, జనవరి 10 ప్రభాతవార్త : మండలంలోని కంచనపల్లి గ్రామంలో స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధు సూధన్‌రెడ్డి సహకారంతో రూ.13లక్షల వ్యయంతో నూతనంగా అంగన్‌వాడీ భవనానికి మండల ఇన్‌ఛార్జి బియ్యపు పవిత్రారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా గ్రామానికి విచ్చేసిన పవిత్రారెడ్డికి వైకాపా సీనియర్‌నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, సర్పంచ్ పద్మమ్మ, శ్రీరాములురెడ్డిలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టే అంగన్‌వాడీ భవనానికి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఈసందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంకు నూతన భవనం నిర్మించడంతోపాటు ఇక్కడ చదివే చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలోనే గర్భిణీస్త్రీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం ద్వారా అందించే సదుపాయాలు అందించాలన్నారు. అనంతరం పవిత్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిట్టత్తూరు సర్పంచ్ కృష్ణమూర్తి, మాజీ ఎంపిపి కోవిచంద్రయ్యానాయుడు, కృష్ణమూర్తి, గిరిరెడ్డి, అల్లెయ్య, కుమార్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ధనంజయులురెడ్డి, వైస్ సర్పంచ్ గోవిందయ్య, కె.సుబ్బరాయులు, సురేష్‌బాబు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయంగా స్వర్ణముఖినది వంతెన!

నాయుడుపేట రూరల్ జనవరి 10 ప్రభాతవార _; నాయుడుపేటకు కూతవేటు దూరంలో ఉన్న స్వర్ణముఖినదిపై వంతెన ప్రమాధాలకు నిలయంగా మారుతున్న సంబందిత అదికారులు పట్టించు కోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.నాయుడుపేట-పండ్లూరు-వెంకటగిరికి ఈమార్గం గుండా వాహనాలు అధికసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి.ఆనాటి బ్రిటీష్ వారి కాలంలో స్వర్ణముఖినదిపై నిర్మించిన వంతెన శిధిలావస్థకు చేరుకొని కూలిపోయేందుకు సిద్దంగా ఉన్న ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు ప్రజల నుండి వ్యక్తమౌతున్నాయి.స్వర్ణముఖినది వంతెనపై సుమారు 15గ్రామాల ప్రజలు ప్రతినిత్యం ప్రయాణం సాగిస్తుంటారు.స్వర్ణముఖినదిపై నిర్మించిన వంతెన అక్కడక్కడ పగులిచ్చి.పెద్దపెద్ద గోతులు ఏర్పడి కూలేందుకు సిద్దంగా ఉంది.ఈవంతెనపై ఏర్పడిన గుంటల వద్ద ఆటోలు,ద్విచక్ర వాహదారులు అదుపుతప్పి ప్రమాధాలు జరిగిన సంఘటనలు కూడ జరుగుతున్నాయి.ఈవంతెనకు శాశ్వత మరామ్మత్తులు చేపట్టాలని ఆర్‌అండ్‌బి అదికారులకు తెలిపిన వారుమాత్రం పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.ప్రమాధభరితంగా ఉన్న ఈస్వర్ణముఖనది వంతెనపై ప్రయాణం చేయాలంటే ప్రాణం గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం సాగించాల్సి వస్తుందని ప్రయాణికులు చెప్పున్నారు.ఇప్పటికైనా అదికారులు స్పందించి కూలేందుకు సిద్దంగా ఉన్న స్వర్ణముఖినది వెంతెనకు శాశ్వత మరామ్మత్తులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## 28న అమ్మవారి ఆలయంలో రథసప్తమి



తిరుచానూరు,జనవరి 10 ప్రభాతవార్త: ఈనెల 28వ తేదీ రథసప్తమి పర్వదినం సందర్భంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించ నున్నారు. ఉదయం 7 నుండి 8 గంటల వరకు హంసవాహనం,ఉదయం 10 నుండి 11 వరకు అశ్వవాహనం,11-30 నుండి మద్యాహ్నం 12-30 వరకు చిన్నశేష వాహనం, సాయంత్రం 6 నుండి రాత్రి 7 గంటల వరకు చంద్రప్రభ వాహనం,రాత్రి 8-30 నుండి 9-30 వరకు గజవాహన సేవ నిర్వహిస్తారు.సాయంత్రం 3-30 నుండి 4-30 గంటల వరకు అమ్మవారి ఆల యంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన కళ్యాణోత్సవం,సామవేద పుష్పాంజలి, సహస్ర దీపాలంకరణ సేవలను టిటిడి రద్దు చేసింది.అమ్మవారి ఆలయానికి సమీపంలోని శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఉదయం 6 నుండి 7 గంటల వరకు స్వామివారు అశ్వవాహనాన్ని అధిష్ఠించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం:**

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని జనవరి 24వ తేదీ ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు.

# పాల సేకరణ ధర పెంపు:పాడిరైతులకు ప్రోత్సాహకాలు



శ్రీకాళహస్తి రూరల్,జనవరి 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ పాలసరఫరా సంఘం పరిధిలోని పాడి రైతులకు పాల సేకరణ ధరను పెంచుటకు చర్యలు తీసుకుంటున్నామని, అలాగే సంఘంలోని సభ్యులు1,600 మందికి 2022-23 సంవత్సరంకు లీటర్‌కు రూ.2ల చొప్పున రివైజ్డ్ రేటుగా రూ.41లక్ష 75వేల 521లు చెల్లించుట హర్షణీయమని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధన రెడ్డి వివరించారు. మార్కెటింగ్ కమిటి ఆవరణలోని గోదాములో శ్రీకాళహస్తి కోపరేటివ్ పాలసరఫరా సంఘం రైతుల సర్వసభ్యసమావేశం ఛైర్మెన్ మునగాల మధుసూధననాయుడు (చిట్టి) అధ్యక్షతన జరిగింది. ఆయన తాము తీసుకుంటున్న అభివృద్ధి పథకాలను వివరించారు. అలాగే రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సహకారంతో రైతులకు అందించాల్సిన సొమ్ములను ప్రభుత్వానికి వృధాగా పన్ను రూపంలో చెల్లించకుండా పంచిపెడు తున్నామని వివరించారు.ఆయన సూచనలతో నేడు ప్రోత్సాహకాలు రూ.21లక్షలతో అందిస్తున్నట్లు తెలిపారు.

**సంక్రాంతి కానుకగా పాల సేకరణ ధర పెంపు:**

శ్రీకాళహస్తి పాలసరఫరా సంఘం పరిదిలోని పాడి రైతులకు సంక్రాంతి కానుకగా పాల సేకరణ ధరను పెంచినట్లు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వివరించారు. ఇక్కడి పాలసరఫరా సంఘం రోజూ 8వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారని అయితే ఐదువేల లీటర్లు మాత్రమే అమ్ముడు పోతుందని మిగిలిన పాలను కోవా తయారు చేసి నష్టాలను సవరించుకుంటున్నామని ఎంఎల్‌ఏ వివరించారు.పాడి రైతులకు సంక్రాంతి కానుకగా ఆవు పాల సేకరణ ధరను రూ.30ల నుంచి రూ.32లకు పెంచామని, అలాగే బర్రెపాలు ధరను రూ.45 నుంచి రూ.50లకు పెంచినామని వివరించారు.కోవా సరఫరా తయారికి కొత్త గదిని ఆధునీకరించుటకు రూ.30లక్షలతో నూతన భవనాన్ని నిర్మించుటకు చర్యలు తీసుకున్నామని వివరించారు. కొత్తగా సవరించిన రేట్లకు సంబంధించిన రైతుల బకాయిలను 2022 జనవరిలో రూ.10,86,998లు 2022మార్చిలో రూ.9,31,355లు ప్రస్తుతం రూ.41,75,521లు వెరసి రూ.61లక్షల 93వేల 874లు అందించినట్లు వివరించారు.

**రైతులకు ప్రోత్సాహకాలు:**

ఈ సందర్భంగా మంగళవారం పాడి రైతులు 1600మందికి శాసనసభ్యుడు బియ్యపుమ ధుసూధనరెడ్డి రూ.21లక్షల విలువైన ప్రోత్సహకాలను అందించారు.సంస్థ ఉద్యోగులకు 2022-223 ఆర్థిక సంవత్స రం బోనసుగా రూ.7,21,442లు మార్చిలో రూ.7,17,000లు చెల్లించారు.ఈ వెసులు బాటును ఎంఎల్‌ఏ ద్వారా అందించారు.ఈ కార్యక్రమాల్లో సభ్యులు హరినాథ్‌రెడ్డి, మంగమ్మ, రామయ్య, రామమూర్తి, మునికృష్ణారెడ్డి,దామోదర్‌రెడ్డి,వెంకటరెడ్డి, రమణి వ్యవసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి, మోహన్‌నాయుడు, వడ్లతాంగళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి, చింతామణి పాండు, మునిరామయ్య, శంకర్‌రెడ్డి, పటాన్ ఫరీద్‌ఖాన్, గంగిరెడ్డి, పసల కృష్ణయ్య, హరిరాయల్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పథకాలకు లక్ష విరాళం



కాణిపాకం, జనవరి 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు మంగళవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. పూతపట్టు మండలం సంజీవరాయనిపల్లెకు చెందిన జయదేవ్ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి 50,116 రూపాయలను, శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 50,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తా_న్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో పురావస్తు, పర్యావరణ, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి

కాణిపాకం, జనవరి 10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు, పర్యావరణ, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్ మంగళవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో జరిగిన సంకటమర గణపతివ్రతంలో ఆమె పాల్గొన్నారు. వారి వెంట సూపరెండెంట్‌లు కోదండపాణి,శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మెడలోంచి బంగారం గొలుసు అపహరణ

చౌడేపల్లి, జనవరి 10 ప్రభాతవార్త : వృద్ధురాలి మెడలోంచి బంగారం గొలుసు దొంగలించుకొని వెళ్ళిన సంఘటన మంగళవారం సాయంత్రం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితురాల కథనం మేరకు...మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయితీ పెద్దకంపల్లికి చెందిన లీలావతి(55)గ్రామ సమీపంలో అక్కగార్లగుట్ట వద్దగల తన పొలంలో గడ్డికోసుకొనేది. సాయంత్రం జన సంచారం లేని సమయంలో ఆమె తన పనిలో నిమగ్నమై ఉండగా గుట్టలోంచి ఓ ఆగంతకుడు వచ్చి తన వీపునుంచి ముందుకు వంచాడని లీలావతి తెలిపింది. ఆయాసం వుండటంతో పెనుగులాడినా ప్రయోజనం లేదనీ, తలపైకెత్తి చూడగా ఓ కుర్రాడు ముఖానికి గుడ్డకటుకొని ముఖం తెలియకుండా వున్నాడంది. తన మెడలోని సుమారు 45గ్రాముల బంగారుచైను (బొట్టుచైను)ను తెంపుకొని మరలా గుట్టలోకి వెళ్ళిపోయాడని వృద్దురాలు వాపోయింది. తాను గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి గాయపడ్డ ఆమెను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

## నృత్య ప్రదర్శనలో ప్రపంచ స్థాయి రికార్డు సాధించిన కేశవరెడ్డి విద్యార్థిని



తిరుపతి (విద్య), జనవరి 10, ప్రభాతవార్త : కేశవరెడ్డి స్కూల్‌లో చదువుతున్న కె. నాగనీహారిక రావు నృత్యంలో ప్రపంచ రికార్డు సాధించింది. గత నెల డిసెంబర్ 17న సిపిఎం ఫంక్షన్ హాల్‌లో ఐసిఎండిఎ వారు నిర్వహించిన అయిగిరినందిని బృంద నాట్యంలో పాల్గొని ప్రపంచ రికార్డును సాధించింది. శ్రీ నృత్యాంజలి అకాడెమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున భరతనాట్యం కళాకారులు పాల్గొని అయిగిరినందిని ఒకేసారి ప్రదర్శించి ప్రపంచ రికార్డు సాధించడం విశేషం. ఈ సందర్భంగా కేశవరెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్. కేశవరెడ్డి నీహారికను అభినందించారు.

## ధర్మకర్తల మండలి ఆధ్యాత్మిక పర్యటన



శ్రీకాళహస్తి,జనవరి 10 ప్రభాత వార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మ కర్తల మండలి ఛైర్మెన్, కొందరు సభ్యులు ఆధ్మాత్మిక పర్య టనకు వెళ్ళారు.ఈ నేపధ్యంలో తమిళ నాడులోని ధర్మపురం ఆదినం శ్రీలాశ్రీ మాశిలామణి దేశిగ పర మాచార్యస్వామి వారిని కలసి మహాశివరాత్రికి ఆహ్వానించారు. ఆయన చేత దేవస్థానం ప్రచురించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.రాబోవు మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసి భక్తులకు దర్శనం కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా స్వామి జీవిత కాల ఉభయదారుడుగా కైంకర్యాలలో భాగస్వామి చేయాలని కోరగా ఆలయాధికారులతో చర్చించిన మీదట సమాచారం అందిస్తామని స్వామికి వివరించారు.ఆదినం స్వామి వారి మఠం ఆధీనంలో నిర్వహిస్తున్న 27 ఆలయాలలో ముఖ్య దేవాలయాలను సందర్శించారు. ఛైర్మెన్‌తో పాటు సభ్యులు కొందరు సునీత,రమాప్రభ, లక్ష్మీ, ఆలయ తేవారం గురుకుల్, ముత్తుకుమార స్వామి, వైకాపా నాయకులు నందా మెడికల్స్ నరసింహారాజు,భాస్కర్‌ముదిరాజ్, లక్ష్మీపతి, బాలాగౌడ్,సునీల్,తేజ తదితరులున్నారు.

## విఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

చంద్రగిరి, జనవరి 10 ప్రభాతవార్త: విఆర్‌ఓల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామానుజపల్లి నాగరాజుకు మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో ఘన సన్మానం జరిగింది. విఆర్‌ఓల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన ఆయనకు తహశీల్దార్ శిరీషా ఆధ్వర్యంలో రెవెన్యూ యం త్రాంగం ఆయనను దుశ్శాలువ పూలమాలలతో ఘన సన్మానిస్తూ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడుగా రాణించి రెవెన్యూ విభాగంలో ఉత్తమ నాయకుడుగా ప్రశంసలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు ఈశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, అమృత, సర్వేయర్ పురుషోత్తం రెడ్డి, ఆర్ఐ సులోచనమ్మ, సి ఉషారాణి, విఆర్‌ఓల వెంకన్న నాయుడు, వాసు, విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, మునస్వామి, సుబ్రమణ్యం నాయుడు, హరి, గిరి, సిబ్బంది ముని, హరికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

హుబ్లీ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు...

## పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినులు



తిరుపతి (విద్య), జనవరి 10, ప్రభాత వార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యా లయం ఎన్‌ఎస్‌ఎస్ బ్యూరో నుండి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 7 ప్రోగ్రాం అధి కారి డా. పి. మాధవి విద్యార్థి వాలం టీర్లు ఐవీఎన్ శ్రావ్య, యూనిట్ 2 జి. భవాని, యూనిట్ 7, రీజనల్ యూత్ ఆఫీసర్‌చే అనుమతి పొందిన 12 మంది విద్యా వాలెంటీర్లు 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్ 2023 హుబ్లీ - ధార్వాడ్‌లో జరగనున్న కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వీరిని యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ రజిని, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డా.జై.కాత్యాయని, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 2 పివో డాక్టర్ కె. స్వాతి అభినందించారు.

## అశ్రితశ్రీకి నాట్య మయూరి అవార్డు

రేణిగుంట, జనవరి 10 ప్రభాతవార్త: ఆశ్రితశ్రీ నాట్య మయూరి జ్యూరీ అవార్డును అందుకుని అందరి మన్ననలు పొందుతుంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కళానిలయం జాతీయ స్థాయి 38వ సంగీత, నృత్య పోటీల్లో పాల్గొని కూచిపూడి నృత్యాన్ని అభినయించినందుకు గాను అవార్డును సంస్థ ఫౌండర్, అధ్యక్షుడు ప్రగడ రాగమోహన్‌రావు చేతుల మీదుగా అందుకుంది. అవార్డు రావడానికి తర్ఫీదు చేసిన గురువు డాన్స్ మాస్టర్ లావణ్య, ప్రోత్సహించిన తల్లిదండ్రులు రవి శారదలతో పాటు బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు ఆశ్రితశ్రీ ధన్యవాదాలు తెలిపారు.

## కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ



నగరి, జనవరి 10 ప్రభాతవార్త: తమిళనాడు తిరుత్తణిలో జరిగిన కరాటే పోటీల్లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరచారు. జపాన్‌షిటోరాయ్ కరాటే స్కూలులో శిక్షణ పొందిన విద్యార్థులు వారం తిరుత్తణిలోజరిగిన కరాటే పోటీ ల్లో పాల్గొన్నారు. వీరిలో ఏ.కార్తీకేయన్, మోహన్‌వేలు, మోహిత్ అనే విద్యార్థులు ఆరెంజ్ బెల్టు, గీతిక, విశ్వ అనే విద్యార్థులు ఎల్లో బెల్టు దక్కించుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు షీల్డ్‌లు, కప్పులు అందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ అన్నాదొరై, ఇతర కరాటే శిక్షకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయండి.

చంద్రగిరి జనవరి 1 ప్రభాతవార్త: అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదరి ్శ వాణీశ్రీ మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వయోపరిమితిని 50 ఏళ్ళకు పెంచాలని కోరారు. కుప్పంలో అంగన్‌వాడీలను వేధిస్తున్న సిడిపిఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రగిరి ప్రాజెక్టు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## వెంకన్నా...."యువగళం" జయప్రదం కావాలి

తిరుపతి,జనవరి 10 ప్రభాతవార్త : రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు స్వయంగా తెలుసుకునేందుకు టిడిపి యువనేత, జాతీయ కార్యదర్శి నారాలోకేష్ చేపట్టనున్న "యువగళం" పాదయాత్ర జయప్రదం కావాలని తిరుపతిలో టిడిపి శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ నాయకత్వంలో మంగళవారం ఉదయం తిరుపతి అలిపిరి వద్ద శ్రీవారి పాదాలమండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కొబ్బరికాయలు కొట్టి మొక్కారు. లోకేష్ చేపట్టనున్న పాదయాత్రకు సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు, కరుణాకటాక్షాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్‌సి మునికృష్ణ, చక్రాల ఉష, లత,తుపాలకు కన్నెమ్మ, లక్ష్మీప్రసన్న, కౌసల్య, మాధవి, పార్వతి, హేమ, నాయుడమ్మ, ప్రసన్న గౌరి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సంకటహర గణపతివ్రతం



కాణిపాకం, జనవరి 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మంగళవారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం సంకష్టహరచతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం నుండి సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ అలంకార మండపంకు తీసుకువచ్చి వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదములను అందజేశారు. సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో అలంకార మండపం కిక్కిరిసింది. దీనితో ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, జనవరి 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఓ భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు కడప జిల్లా అక్కయ్యపల్లికు చెందిన హరికృష్ణ అనే భక్తుడు నిత్యాన్న దానంకు లక్ష రూపాయలను ఆన్‌లైన్ ద్వారా విరాళంగా అందజేశారు. దాత కుటుంబసభ్యులకు ఆలయ సూపరె ండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబులు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


